

పిపిలకు సన్మానం



పిపిలను సన్మానిస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం అర్బన్ : ఐదేళ్ల పిపిలుగా నియామకమైన ఇద్దరు న్యాయవాదులను మంగళవారం జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, బిసి న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆగూరి ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, ఇతర సీనియర్ న్యాయవాదులు మంగళవారం సన్మానించారు. రెండో అదనపు జిల్లా, సెషన్స్ కం మహిళా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చింతాడ సత్యనారాయణ, ఫోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లోచుగు వెంకటరమణ నియమితులయ్యారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సనపల హరి, గెదెల వాసుదేవరావు పాల్గొన్నారు.

టిడిపిలో వీడని ఉత్కంఠ

- పెండింగ్‌లో నాలుగు స్థానాలు
- నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల నిరీక్షణ
- రెండు, మూడో రోజుల్లో మూడో జాబితా ఉంటుందంటూ ప్రచారం
- నేడు తేలనున్న ఎంపీ అభ్యర్థి

టిడిపిలో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా, ఇప్పటివరకు నాలుగు స్థానాలకు మాత్రమే టిడిపి తన అభ్యర్థులను ప్రకటించింది. మొదటి జాబితాలో టెక్కలి, ఇచ్ఛాపురం, ఆమదాలవలస స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. రెండో విడతలో నరసన్నపేట స్థానానికి ఖరారు చేసింది. మిగిలిన స్థానాలను పెండింగ్‌లో ఉంచింది. దీంతో ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, మద్దతుదారులు తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థుల మూడో జాబితా రెండు, మూడు రోజుల్లో రావొచ్చని పార్టీ నాయకులు ఆశిస్తున్నారు. మరోవైపు జిల్లాకు సంబంధించి ఎంపీ స్థానానికి అభ్యర్థిని ప్రకటించలేదు. ఎంపీ అభ్యర్థి ఎవరనేది బుధవారం తేలనుందని తెలుస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాకు సంబంధించి టిడిపి మరో నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. వాటిలో శ్రీకాకుళం, పలాస, పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాలు ఉన్నాయి. శ్రీకాకుళం నియోజకవర్గం పేరు మొదటి జాబితాలోనే ఉంటుందని అంతా భావించినా... జాబితాలో లేకపోవడంతో నియోజకవర్గ పార్టీ శ్రేణులు కొంత నిరాశకు గురయ్యాయి. కనీసం రెండో జాబితాలో ఉంటుందని గట్టిగా ఆశించారు. అందులో పేరు లేకపోవడంతో నాయకుల్లో ఆగ్రహం తెప్పించింది. పైగా శ్రీకాకుళం సీటును బిజెపికి కేటాయిస్తారంటూ ప్రచారం జరగడంతో కోపం కట్టలు తెంచుకుంది. ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఇంటి వద్ద ఆందోళనకు సైతం దిగారు. బిజెపికి ఇస్తే టిడిపి ఎంపీ సీటు గెలుపునకు ఉండే ఇబ్బందులను నియోజకవర్గ నాయకులు ఎంపీ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. వీటిని పరిగణనలోకి తీసుకున్న రామ్మోహన్‌నాయుడు పార్టీ అధినేత చంద్రబాబుతో మాట్లాడారని పార్టీ నాయకులు చెప్తున్నారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవికే సీటు ఖరారవుతుందని గట్టి నమ్మకంతో ఉన్నారు.

ఎచ్చెర్లపై ఏం తేలుస్తారో?

ఎచ్చెర్ల నియోజకవర్గం అభ్యర్థి ప్రకటనకు రకరకాల సమీకరణాలు ఉండటంతో ఇప్పటివరకు దానిని ప్రకటించలేదు. మాజీ మంత్రి కళా వెంకటరావును విజయనగరం ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టాలని పార్టీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. అయితే ఆయన మాత్రం ఎచ్చెర్ల సీటుపై ఆశలు పెట్టుకున్నారు. ఎంపీ అభ్యర్థిగా కళా వెంకటరావు వెళ్తే ఆ సీటును బిజెపికి కేటాయించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

పాతపట్నం అభ్యర్థి ఎవరో?

పాతపట్నం నియోజకవర్గం అభ్యర్థి ప్రకటన విషయంలో టిడిపిలో కొంత గందరగోళం నెలకొన్నట్లు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు ఇరువురూ పార్టీ టిక్కెట్‌ను ఆశిస్తున్నారు. టిడిపి చేపట్టిన ఐవిఆర్‌ఎస్ సర్వేలో అధికశాతం మంది మామిడి గోవిందరావు వైపే మొగ్గు చూపినట్లు తెలిసింది. అందుకు కారణాలు కూడా లేకపోలేదు. వైసిపి తరుపున ఇదే స్థానం నుంచి మళ్లీ పోటీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి మద్దతుదారులు, పార్టీ శ్రేణులు ఆమెతో పోటీ పడనున్న టిడిపి అభ్యర్థి బలహీన ప్రత్యర్థి అయితే తమకు తేలిగ్గా గెలవచ్చని గోవిందరావుకు మద్దతు పలికినట్లు చర్చ జరుగుతోంది.

పలాస సీటు శిరీషకేనా?

పలాస నియోజకవర్గం టిడిపిలో ఇబ్బందులు లేకపోయినా పెండింగ్‌లో పెట్టడంపై పార్టీ శ్రేణులకు అంతు చిక్కడం లేదు. రెండో జాబితాలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీష పేరు ఉంటుందని ప్రచారం జరిగినా పేరు ఖరారు కాలేదు. మూడో జాబితాలో ఆమెకు కచ్చితంగా సీటు వస్తుందని పార్టీ నాయకులు గట్టి నమ్మకంతో ఉన్నారు.

ఎంపీ అభ్యర్థిగా రామ్మోహన్‌నాయుడు?

రాబోయే ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయనున్న అభ్యర్థులను రెండు విడతల్లో పార్టీ ప్రకటించింది. పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి ఇప్పటివరకు ఒక్క జాబితా విడుదల కాలేదు. ఎంపీ అభ్యర్థులపై కసరత్తు జరుగుతున్నట్లు నేపథ్యంలో తొలిజాబితా బుధవారం రానుందని ప్రచారం సాగుతోంది. శ్రీకాకుళం ఎంపీ స్థానానికి రామ్మోహన్‌నాయుడు పేరే ఖరారవుతుందని అంతా అనుకుంటున్నారు.



రణస్థలం : అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

అధికారులు అప్రమత్తం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- రణస్థలం

ఎన్నికల కోడ్‌పై అధికారులు అప్రమత్తంగా ఉండి ఎక్కడా కోడ్ ఉల్లంఘనలు జరగకుండా చూసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం మండలంలో పర్యటించారు. ముందుగా తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితాను పరిశీలించారు. పైడిభీమవరం చెక్‌పోస్టు తనిఖీ చేసి సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా ముఖద్వారం పైడిభీమవరంలో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని పోలీస్‌శాఖకు ఆదేశించారు. కోష్ట పంచాయతీలో పల్లిపేటలోని 182, 183 పోలింగ్ కేంద్రాలను, 183 మోడల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ప్రచారంలో వాలంటీర్లు పాల్గొంటున్నారా? అని బిఎల్ఓను అడిగి తెలుసుకున్నారు.

లావేరు : మండలంలోని వెంకటాపురం జిల్లా సరిహద్దు ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే అప్పాపురంలోని 84, 85 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు వద్ద కట్టుదిట్టంగా ఉండాలని ఆదేశించారు. తరచూ తనిఖీలు చేపట్టాలన్నారు. వెంకటాపురం వద్ద దీపురపల్లి వెళ్లే రహదారి, వెంకటాపురం నుంచి విజయనగరం జిల్లా నెమ్మలవలస మీదగా రాజాం వెళ్లే కూడలిలో రెండు చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని అన్నారు. అప్పాపురం గ్రామాన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని ఎందుకు గుర్తించారని అధికారులను ప్రశ్నించారు. ఇన్‌సైడ్ ఓటింగ్ జరుగుతుండటంతో గుర్తించామని తెలిపారు. ఆయన వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మణమూర్తి, తహశీల్దార్ పి.లక్ష్మీదేవి, జె.ఆర్.పురం సిఐ జి.రామచంద్రరావు, ఎస్ఐ సిహెచ్.స్వామినాయుడు ఉన్నారు.



సమీక్షిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించాలి

డిఎంహెచ్ఒ మీనాక్షి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన స్టిక్కర్లు, పోస్టర్లు, బ్యానర్లు ఉండకూడదని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కారణంగా వాటిని తొలగించడం గాని, కనిపించకుండా పేపర్లు అతికించడం గాని చేపట్టాని డిఎంహెచ్ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి ఆదేశించారు. డిఎంహెచ్ఒ కార్యాలయంలో వైద్యులతో, సిబ్బందితో ఆమె మాసాంతపు సమీక్ష మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి ఆరోగ్య సిబ్బంది ద్వారా నిర్ణీత సమయంలో నిర్వహించాలన్నారు. అందులో రాజకీయ నాయకుల ఫొటోలు ఉండకుండా రోగులకు వైద్య సేవలు అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ సమయంలోనూ తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ నెల 31 లోగా ఫార్మసిస్టులు సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ నుంచి మందులు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. తెలుపు రంగు కాటన్ వస్త్రాలు ధరించడం, ఎండలో నుంచి వచ్చిన వెంటనే నీరుగాని నిమ్మరసం, కొబ్బరి నీరు తాగాలన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఒఆర్ఎస్ కలిపిన నీటిని తాగడం వల్ల వడదెబ్బ నుంచి సత్వర ఉపశమనం లభింస్తుందని అన్నారు. సమావేశంలో అదనపు డిఎంహెచ్ఒ, ఇతర ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

పలుచోట్ల వర్షాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, యంత్రాంగం

జార్ఖండ్ నుంచి కోస్తాంధ్ర వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో జిల్లాలో మంగళవారం పలుచోట్ల మోస్తారు వర్షాలు కురిశాయి. జిల్లాలో హిరమండలం గొట్టాబ్యారేజీ ప్రాంతంలో జిల్లాలో అత్యధికంగా వర్షం కురిసింది. ఇక్కడ 42 మి.మీ. వర్షపాతం నమోదైంది. జి.సిగడాంలో 27.5 మి.మీ. వర్షం పడింది. బూర్జ మండలం మదనాపురంలో 25.5 మి.మీ, పాతపట్నం మండలం జగ్గిలిబొంతులో 18.25 మి.మి వర్షం కురిసింది. ఆమదాలవలస మండలం తిమ్మాపురంలో 6 మి.మీ, చింతాడలో 4.25 మి.మీ, ఆమదాలవలస టౌన్‌లో నాలుగు మి.మీ వర్షం కురిసింది. అదేవిధంగా నందిగాం మండలం మదనాపురంలో ఐదు మి.మీ వర్షం, పాతపట్నం మండలం 3.25 మి.మీ, ఇచ్ఛాపురంలో 1.75 మి.మీ, జలుమూరు మండలం సైరిగాంలో ఒక మి.మీ వర్షం పడింది. పలాస మండలం



పాతపట్నం : కురుస్తున్న వర్షం

చిన్నబాడాం, సోంపేట మండలం బాతుపురం, జలుమూరు, ఎచ్చెర్ల ప్రాంతాల్లో అర మి.మీ చొప్పున వర్షంపాతం నమోదైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కొంత మోదాన్ని, కొంత ఖేదాన్ని కలిగిస్తున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వరి, నువ్వులు తదితర పంటలకు కొంత మేర దోహదపడుతుందని రైతులు చెప్తున్నారు. ఇదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న, నువ్వులు, రాగులు కోతలు పూర్తయ్యాయి. రోడ్లు, కళ్లాల్లో ఆరబెట్టిన పంట వర్షానికి కొంత మేర తడిసిపోయినట్లు తెలుస్తోంది.

27 నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శంకరశర్మ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ఈ నెల 27 నుంచి 30 వరకు జాతీయస్థాయి నాటక పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీసుమిత్ర కళా సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. నగరంలోని ఆవోపా కళ్యాణ మండపంలో మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా అంతర్జాతీయ రంగస్థలం కళాకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసుమిత్ర కళాసమితి ఆధ్వర్యాన జాతీయస్థాయి నాటక పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్ వేదికగా జరగనున్న ఈ పోటీలకు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నాటక పరిషత్‌లు తమ ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 27న గురజాడ అప్పారావు రచించిన 125 సంవత్సరాల నాటి కన్యాశుల్కం నాటకాన్ని ప్రదర్శించనున్నట్టు చెప్పారు.

ఈ నాటక ప్రదర్శనకు రూ. 50 ప్రవేశ రుసుం చెల్లించిన వారికి మాత్రమే ప్రవేశం కల్పించనున్నట్టు వివరించారు. నాటక ప్రదర్శన అనంతరం రంగస్థల కళాకారులను అభినంద సత్కారం ఉంటుందని అన్నారు. 28 నుంచి 30 వరకు కౌసల్య సుప్రజా రామా, ఎడారిలో వాన చినుకు, మూల్యం, కబ్జా, ఇంద్రప్రస్తం, పక్కింటి మొగుడు తదితర నాటకాలను ప్రదర్శించనున్నట్టు చెప్పారు. ఈ ప్రదర్శనలకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో రాజకీయాలకతీతంగా రాజకీయ ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. కార్యక్రమంలో కళాకారులు, జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సుమిత్ర కళా సమితి ప్రధాన కార్యదర్శి గుత్తు చిన్నారావు, కోశాధికారి నక్క శంకరరావు, ఉపాధ్యక్షులు మండవిల్లి రవి, కిల్లాన ఫాల్గుణరావు, తిమ్మరాజు నీరజ, మెట్ట పోలినాయుడు, కొమనాపల్లి సురేష్, బంకుపల్లి శంకరం, ఎం.వరలక్ష్మి, పూజ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఎన్నికల నియమావళి అమలు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రి ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ విభాగాలు పొరపాట్లకు తావు లేకుండా పూర్తి సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆర్‌ఒలు, ఈఆర్‌ఒలు, నోడల్ అధికారులు, ఎన్నికల ప్రత్యేక అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంసిసి, ఫ్లైయింగ్ స్క్వాడ్, వీడియో సర్వెలెన్స్, వీడియో వీవింగ్, స్టాటిక్ సర్వేలెన్స్, మీడియా మోనటరింగ్ టీమ్‌లు వారికి సంబంధించిన విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనుమానం ఉన్న చోట నిశితంగా సోదాలు చేపట్టాలన్నారు. బృందాల మధ్య సంబంధం ఉంటుందని, దానిని అనుసరించి నియమావళి ప్రకారం తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. నియమావళి అమలులో భాగంగా పార్టీ, అభ్యర్థుల ఖర్చు, ర్యాలీలు, సమావేశాలను, ప్రకటనలు, బానర్ అనుమతులు, వాటికి ఖర్చును లెక్క వేయడంతో పాటు నాయకుల ఉపన్యాసాలు వీడియోల ద్వారా వీవింగ్ టీమ్ గుర్తించాలన్నారు. ఎంసిసి టీమ్ మోడల్ కోడ్‌ను నిరంతరాయంగా గమనించాలన్నారు. అలాగే వివిధ పత్రికల్లో వచ్చిన ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌ను గుర్తించాలన్నారు.

సినిమా థియేటర్లు, స్థానిక కేబుల్ టివిల్లో వచ్చే ప్రకటనలపైనా నివేదించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఈటీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోజూ క్రమం తప్పకుండా నిర్దిష్ట సమయానికి ఈసిఐకి పంపాల్సిన నివేదికలు అందజేయాలన్నారు. ఫిర్యాదులపై తక్షణ స్పందన అవసరమని స్పష్టం చేశారు. సమావేశంలో టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, సహాయ కలెక్టర్ రాఘువేంద్రమీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్ నాయక్, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ రాణీమోహన్, సిపిఒ ప్రసన్నలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, డిటిసి చంద్రశేఖర్‌రెడ్డి, సెబ్ అధికారి తిరుపతి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు, ఔషధ నియంత్రణ శాఖ ఏడీ చంద్రరావు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, డిపిఒ వెంకటేశ్వర్లు, గడ్డెమ్మ, చల్లా ఓబులేసు, నగేష్, చిట్టిరాజు, గణపతిరావు, జయప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఇసుక అక్రమ తవ్వకాలు అడ్డగింత

ప్రజాశక్తి- గార

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత జిల్లాలో వంశధార, నాగావళి నదుల్లో పెద్దఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతుందని, అధికారులు నియంత పాలన వైపే మొగ్గు చూపుతూ అక్రమ మైనింగ్‌ను అడ్డు కట్ట వేయకుండా చోద్యం చూస్తున్నారని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు, టిడిపి నాయకులు గొండు శంకర్ ఆరోపించారు. గార మండలం బూరవెల్లి వద్ద అక్రమంగా నడుపుతున్న ఇసుక ర్యాంప్‌ను గ్రామస్తులు, టిడిపి కార్యకర్తలతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలను తుంగలో తొక్కి, ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని అన్నారు. మైన్స్ అధికారులు గత ఫిబ్రవరిలో 5,600 క్యూబిక్, 0.56 సెక్టార్లో అనుమతులు మంజూరు చేశారని అన్నారు. ఇక్కడ అందుకు విరుద్ధంగా లక్షల క్యూబిక్ మీటర్లలో తవ్వకాలు జరుపుతూ రూ.కోట్ల విలువైన ఇసుకను యథేచ్ఛగా తరలించుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నదిలో యంత్రాలతో తవ్వకూడదన్న నిబంధన పట్టించుకోకుండా భూగర్భ జలాలు అడుగంటి పోతున్నా పట్టించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. దీంతో యంత్రాలను అడ్డుకున్నామని చెప్పారు వంశధార నది పరివాహక ప్రాంతంలోని బూరవల్లి, అంబళ్లవానిపేట, సాలిహుండం



ఇసుక తవ్వకాలను అడుకున్న టిడిపి నాయకులు

పూసర్లపాడు, కొంక్యానపేట గ్రామాల్లో నలభై బోర్లకు నీరు అందకుండాపోయిందని అన్నారు. భూగర్భ జలాలు రానురానూ పాతాళానికి చేరుతున్నాయని పేర్కొన్నారు. అక్రమ తవ్వకాలపై మైన్స్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగానికి ఫిర్యాదులు ఇచ్చినా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల కోడ్ వచ్చినా తనిఖీలు చేయకుండా మౌనం వహించడంపై అభ్యంతర వ్యక్తం చేశారు. ఇసుక ర్యాంపు తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట గార మాజీ ఎంపిపి గుండ భాస్కరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొండు వెంకటరమణమూర్తి, శాలిహుండం సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, తూలుగు మాజీ సర్పంచ్ కొయ్యాన జగదీష్, రెడ్డి శంకర్ పాల్గొన్నారు.

సాఫీగా పరీక్షలు రాయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులు సాఫీగా పది పరీక్షలు రాలయిన ఎస్‌పి జి.ఆర్.రాధిక సూచించారు. నగరంలోని శ్రీచైతన్య, కేశవరెడ్డి పాఠశాలల్లో జరుగుతున్న పదో పరీక్షా కేంద్రాలను శనివారం పరిశీలించారు. విద్యార్థులు ఎలాంటి సెల్‌ఫోన్లు, స్మార్‌వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షాకేంద్రాలకు తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనికీలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాల వల్ల 30 పోలీస్ యాక్టు, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీప ప్రాంతాల్లో పరీక్ష పూర్తయ్యే వరకు జిరాక్స్ షాపులకు అనుమతించరాదన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.



వివరాలు సేకరిస్తున్న ఎస్‌పి రాధిక



అవగాహన కల్పిస్తున్న నారంనాయుడు

జీడికి పోషక యాజమాన్యం తప్పనిసరి

పలాస : జీడి మొక్కలకు అంటు నాటడం, కత్తిరింపులు, ఎరువులు, పోషక యాజమాన్యం చేసినట్లయితే హెక్టార్లుకు 1,500 నుంచి 2000 కిలోలు వరకు జీడి పిక్కలు దిగుబడి వస్తుందని వైఎస్ఆర్ వి.ఆర్.గూడెం డైరెక్టర్, శాస్త్రవేత్త ఎల్.నారంనాయుడు సూచించారు. పలాస జీడి పరిశ్రమ ఉత్పత్తి సంఘంలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యాన జీడి పంటపై జీడి రైతులకు మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాసలో సాగుయ్యే జీడి పిక్కలు ఇప్పుడున్న పరిశ్రమలకు సరిపడకపోవడంతో ఇతర దేశాల నుంచి జీడి పిక్కలను దిగుమతి చేయాల్సి వచ్చిందన్నారు. జీడి పిక్కలను దిగుమతి చేసుకుంటున్నమే తప్ప జీడిపప్పు భారతదేశం నుంచి ఇతర దేశాలకు ఎగుమతి కావడం లేదన్నారు. జీడిపప్పు ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గిపోయింద న్నారు. జీడి సాగులో కొత్త విధానాన్ని అమలు చేయాలని, అందుకు అనుగుణంగా పాత పద్ధతిని క్రమేపీ విడిచిపెట్టి కొత్త విధానాలను అమలు చేయడం ద్వారా దిగుబడులు పెరుగుతాయన్నారు. జీడిలో అంటు మొక్కలు పెంపకం పెంచాలన్నారు. అంటు మొక్కల ద్వారా జీడి సాగు పెరగడంతో పాటు అధిక దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఉద్యానవనశాఖ శాస్త్రవేత్త ఎస్.బి.వి. చలపతిరావు, శ్రీకాకుళం శాస్త్రవేత్త బి.వి.కె. భగవాన్, కెవికె ఆమదాలవలస శాస్త్రవేత్త వి. హరికుమార్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ఆర్.వి.వి.ప్రసాదరావు, పలాస ఉద్యానవన శాఖ అధికారి శంకర్‌దాస్, వివిధ మండలాల ఉద్యానవనశాఖ అధికారులు సునీత, మాధవీలత, మంగమ్మ, అయింతికుమారి, సుదర్శన, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



బూర్జ : పొలం గట్టుపై ప్రచారానికి వెళ్తున్న స్పీకర్ సీతారాం

స్పీకర్ సీతారాం ప్రచారం

ప్రజాశక్తి- బూర్జ

పథకాలు, అభివృద్ధి చూసి సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తోటవాడ పంచాయతీ కొమ్ముపాలెం, పిఎల్ దేవీపేట పంచాయతీ నరేంద్రపురంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ సీతారాం ఇంటింటికీ వెళ్లి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అందజేసిన పథకాలు, అభివృద్ధి చూసి ఓటు వేయాలన్నారు. మరల సిఎంగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిట్కో డైరెక్టర్ గోవిందరావు, ఎంపిటిసి జి.రాంబాబు, స్థానిక సర్పంచ్ సూరా ఆనందరావు, వైస్ ఎంపిపి కరణం కృష్ణం నాయుడు, సూర్యారావు, కె.నాగేశ్వరరావు, వెంకట్, రమణ, వెంకటేష్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పలాస: సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును గెలువు భయమని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు (చిట్టి) అన్నారు. మంగళవారం మండలంలోని నీలిభద్ర, బంటుకొట్టూరు, నారాయణపురం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అప్పలరాజును అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.షన్ముఖరావు, మాజీ ఎంపిటిసి దంతం వైకుంఠరావు, కె.గంగాధరరావు, రామారావునాయుడు, జి.మోహనరావు, శారదారావు, భాస్కరరావు, చిలకయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్'లో పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బేసిక్ సైన్స్ అండ్ హ్యుమనిటీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సాయిబాబా నెయ్యిల 'బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్' అనే పుస్తకాన్ని రచించారు. దీనిని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం ఆవిష్కరించారు. ఎంబిఎ విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగ పడుతుందని వివరించారు. విద్యార్థులకు ఉపయోగ పడే మరిన్ని అధునాతన పుస్తకాలను రచించాలని రచయిత డాక్టర్ సాయిబాబాకు నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఈ పుస్తకావిష్కరణలో ఆరెన్డీ డీన్ డాక్టర్ డి.ఆజాద్, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, బిఎస్ఇండ్ హెచ్చఓడి డాక్టర్ ఆర్.శాంతికుమార్, ఎంబిఎ హెచ్‌డి డాక్టర్ బి.శివకుమార్, డిప్లొమో డిప్యూటీ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

శిరీషపై దుష్ప్రచారం తగదు

పలాస: సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషనే పలాస ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు తెలిపారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో వైసిపి నాయకులు శిరీషాకు టిక్కెట్ కేటాయించలేదని, గౌతు శిరీషకు టిక్కెట్ కేటాయించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని దుష్ప్రచారం చేయడం తగదన్నారు. జరగబోయే ఎన్నికల్లో రాష్ట్ర పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఓటమి భయంతో తన అనుచరులతో సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్‌లు పెట్టి దుష్ప్రచారానికి పాల్పడు తున్నారన్నారు. దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికలు అధికారులను కోరారు. అనంతరం ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, టంకాల రవి శంకర్ గుప్తా, సప్ప నవీన్, అంబటి కృష్ణమూర్తి, యవ్వారి మోహనరావు ఉన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

సరుబుజ్జిలి : మండలంలోని సింధువాడ, వీరమల్లిపేట, యరగాం గ్రామాల్లో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ శంఖారావం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సింధువాడలో వైసిపి మండల సేవాదళ్ కన్వీనర్ మీసాల అప్పలనాయుడు, విద్యా కమిటీ చైర్మన్ బి. ఎర్రంనాయుడు, సబ్బ పూర్ణ, మాజీ సైనికోద్యోగి ఊటపల్లి అప్పారావు ఆధ్వర్యాన 30 కుటుంబాలు, వీరమల్లిపేటలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లతో సహా మరో వంద కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వీరికి ఎంపీ, రవికుమార్ టిడిపి కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చెరువుకు రక్షణ గోడ, మరి కొన్ని అభివృద్ధి పనులుచేపట్టాలని కోరారు. యరగాం సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేడాడ రామ్మోహనరావు, మండల అధ్యక్షులు పైడి మురళీమోహన్, టిడిపి జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు, టిడిపి నాయకులు శివ్వాల సూర్యం, పల్లి లక్ష్మి, కిల్లి సిద్ధార్థ, అంబళ్ల రాంబాబు, రామారావు పాల్గొన్నారు.



ఎల్ఇడి దీపాలు అందజేస్తున్న సభ్యులు

150 ఎల్ఇడి వీధి దీపాలు వితరణ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని మురికివాడల్లో వెలుగులు నింపేందుకు లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ 150 ఎల్ఇడి వీధి దీపాలను అమర్చడానికి తోడ్పాటు అందించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను క్లబ్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకుని మంగళవారం ఎల్ఇడి వీధి దీపాలను అందజేశారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ చేపడుతున్న సామాజిక, సమాజ సేవా కార్యక్రమాలు మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ డాక్టర్ దేవభూషణరావు, ప్రధాన కార్యదర్శి రాంగోపాల్, సెక్రటరీ మణి పాల్గొన్నారు.

జోరుగా వైసిపి సమావేశాలు

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికలకు సంబంధించి షెడ్యూలు విడుదల కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు గ్రామాల్లో సమావేశాలు, చేరికలతో బిజీగా ఉన్నారు. ప్రధానంగా అధికార పార్టీ నేతలు మున్సిపాలిటీ పరిధిలో బూత్‌ల వారీగా ముఖ్య నేతలతో సమావేశం జరిపి రానున్న ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలో ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇంతవరకు పార్టీకి దూరంగా ఉంటున్న నేతల ఇళ్ళకు స్వయంగా వెళ్లి పార్టీ విజయానికి కృషి చేయాలని చెపుతున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలో విస్తృతంగా పర్యటించి ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు.

బోధనలో ఆదర్శం

- కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా పాఠాలు
- పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు
- ఆరో తరగతి ప్రవేశాలకు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- జి.సిగడాం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇంగ్లీషు భాషతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ఇతర సబ్జెక్టుల్లో పట్టు తప్పనిసరి. ఇవన్నీ గతంలో ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమయ్యేవి. ఈ నేపథ్యంలో ప్రతి నిరుపేద విద్యార్థికి ఉత్తమ విద్యను అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటైన ఆదర్శ పాఠశాలలు (ఎపి మోడల్ స్కూళ్లు/జూనియర్ కళాశాలలు) నేడు రాష్ట్ర ప్రభుత్వ ఆదరణతో సత్ఫలితాలు సాధిస్తున్నాయి. పరీక్షలు ఏవైనా ఫలితాల్లో దూసుకెళ్తున్నాయి. మోడల్ స్కూళ్లలో చేరేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు.

31 వరకు దరఖాస్తుల స్వీకరణ

2024-25 విద్యా సంవత్సరానికి మోడల్ స్కూళ్లలో ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించింది. ఈ నెల 2 నుంచి నెట్‌బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్ ఎగ్జామినేషన్ ఫీజుకు చెల్లుబాటు కానుండగా, దరఖాస్తులు చేసుకునే ప్రక్రియ ఈ నెల 3 నుంచి మొదలుకానుంది. ఆన్‌లైన్ పేమెంట్ ఈ నెల 31తో గడువు ముగియనుంది.

జిల్లాలో 13 మోడల్ స్కూళ్లు

జిల్లాలో జి.సిగడాం, ఇచ్ఛాపురం (పురుషోత్తపురం), కంచిలి (ఎంఎస్‌పల్లి), కవిటి(రాజపురం), సోంపేట, పోలాకి (ఈదులవలస), పాతపట్నం (ప్రహరాజపురం), జలుమూరు (కరవంజ), లావేరు (తామాడ), రణస్థలం (కొండములగాం), పొందూరు (వావిలపల్లిపేట), ఎచ్చెర్ల(కుప్పిలి), బూర (ఒవిపేట) పాఠశాలల్లో ఒక్కోచోట 100 సీట్లను భర్తీ చేస్తారు. ఈ లెక్కన మొత్తం 1300 మందిని ఎంపికచేస్తారు.

మోడల్ స్కూళ్లలో లభిస్తున్న సౌకర్యాలు



జి.సిగడాం ఆదర్శ పాఠశాల

నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన, ఐదు ఎకరాల సువిశాల ప్రాంగణాలతో, రెండంతస్తుల భవనాలు, 6 నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఇంగ్లీష్ మీడియంలోనే విద్యా బోధన, నీట్, జెఇఇ, ఎంసెట్, ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్, ఐఎంఒ, ఐఎస్ఒ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, అన్ని సౌకర్యాలతో కూడిన గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్‌లు, ఎల్‌సిడి ప్రొజెక్టర్ విద్యాబోధన, డిజిటల్ విద్యా బోధన, ఇంటర్‌లో ఎంపిసి, బైపిసి, ఎంఇసి గ్రూపులు, 9వ తరగతి నుంచి అకడమిక్ విద్యకు సమాంతరంగా కనీసం రెండు ఒకేషనల్ కోర్సులు, బాలికలకు మాత్రమే 9వ తరగతి నుండి ఇంటర్ వరకు హాస్టల్ వసతి సౌకర్యం కల్పించబడింది.

పాత పద్ధతిలో పరీక్ష

లాటరీ విధానానికి పూర్తిగా స్వస్తిపలికి దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూల్‌లోనే ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. మెరిట్ టెస్ట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం సీట్లు కేటాయించనున్నారు. ఏప్రిల్ 27న మెరిట్ లిస్టు, 29న ఎంపికైన వారి జాబితా వెల్లడిస్తారు. 30న సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. జూన్ 12 నుంచి తరగతులు నిర్వహిస్తారు.

ఎంపిక ఇలా..

6వ తరగతిలో ప్రవేశం పొందే ఒసి, బిసి కులాలకు చెందిన విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్ట్ 31 మధ్య జన్మించి ఉండాలి. వీరు కనీసం 35 మార్కులు పొంది ఉండాలి. పరీక్ష ఫీజు రూ.150, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్ట్ 31 మధ్య జన్మించి ఉండాలి. కనీసం 30 మార్కులు పొంది ఉండాలి. పరీక్ష ఫీజు రూ.75 మాత్రమే. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2022-23, 2023-24 విద్యాసంవత్సరాల్లో 4, 5 తరగతుల్లో చదివి ప్రమోషన్‌కు అర్హతపొంది ఉండాలి. పరీక్షలో వచ్చే మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రతిపాదికన సీట్లు కేటాయిస్తారు. సిఎస్ఇ.ఎపిజిఒవి.ఇన్ లేదా ఎపిఎంఎస్.ఎపి.జివి.ఇన్ వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

ఉత్తమ ఫలితాలు

మూడేళ్లుగా చూసుకుంటే ఎస్ఎస్‌సిలో పాస్ పర్సంటేజ్ 2020-21, 2021-22, 2022-23లో 100శాతం, ఇంటర్‌లో 2020-21, 2021-22లో 100 శాతం, 2022-23లో 97శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎన్ఎంఎంఎస్‌లో 2002-2021లో 13 మంది 2021-2022లో పదిమంది 2022- 2023లో ఇద్దరు 2023- 2024లో 8 మంది సాధించారు. అలాగే పోగిరి ఇందుమతి (582), కాలేపు మోక్షశ్రీ (569), కంచు దేవి(566), అలజంగి రమ్య వసంతకుమారి(565) ఈ నలుగురు 2022 -2023 ఎస్ఎస్‌సి ఫలితాల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకొని ట్రిబుల్ ఐటిలో సీట్లను కైవసం చేసుకున్నారు. అలాగే గత పది ఫలితాల్లో 550 మార్కులు దాటి 8 మంది సాధించగా, 500 మార్కులు పైబడిన వారు 25 మంది విద్యార్థులు ఉన్నారు.



పాఠశాల లైబ్రరీలో చదువుతున్న విద్యార్థులు

గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సువర్ణావకాశం



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో చదవాలంటే ఖర్చుతో కూడుకున్న విద్య. ఇప్పుడు ఎపి మోడల్ స్కూల్‌లో ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్‌కు ధీటుగా తీర్చిదిద్దుతున్నాం. విద్యార్థులపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ ఉంటుంది.

\- డాక్టర్ లంక అన్నా శామ్యూల్, ప్రిన్సిపాల్, జి.సిగడాం

ఇంజినీర్ అవుతా



నేను జి.సిగడాం మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివాను. పదిలో 582 మార్కులు వచ్చాయి. ట్రిపుల్ ఐటిలో సీటు సంపాధించాను. ఇక్కడ విద్యతో పాటు ఉన్నత నైపుణ్యాలు కూడా నేర్పుతారు.

\- పోగిరి ఇందు, విద్యార్థిని (ఫైల్)

ఓటు... మన హక్కు



పోలాకి : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు



నందిగాం : ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది, మహిళా సంఘాలు

ప్రజాశక్తి- పోలాకి

ఓటు హక్కు మన జన్మ హక్కని, ప్రతిఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని డిటి పి.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఓటుహక్కు, ఓటునమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేసారు. మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేయాలని, ఓటు విలువ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీరామమూర్తి, ఆర్ఐ సతీస్, విఆర్ఒలు, కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఓటుహక్కు వినియోగంపై వెలుగు ఎపిఎం ప్రసాదరావు ఆధ్వర్యంలో మహిళా సంఘాలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో విఇఎలు, సిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని వెలుగు కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ఎపిఎం జాంభవతి ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన వారు విధిగా ఓటుహక్కు నమోదు చేయించుకుని వినియోగించుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలో వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని వెదుళ్లవలసలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఓటుహక్కుపై వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అవగాహన కల్పించారు. వయోజనులంతా తమ ఓటు హక్కును తప్పనిసరిగా, వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం లీడర్లతో పాటు మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

సరుబుజ్జిలి: నియోజకవర్గంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మహిళా ఓటింగ్ శాతం పెంచేందుకు ముందుకు రావాలని తహశీల్దార్ జి.రమేష్ బాబు తెలిపారు. బూర్జ తహశీల్దార్ ఎస్.వి.అంబేద్కర్‌తో కలిసి మండలంలోని పురుషోత్తపురంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులు వద్దకు వెళ్లి కూలీలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఒ బి.పార్వతి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : మానవహారం నిర్వహిస్తున్న మహిళా సంఘాలు



ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాలు

కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి- పాతపట్నం

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మండల కేంద్రంలో మంగళవారం కేంద్ర పోలీసు బలగాలతో స్థానిక సిఐ ఎన్.సాయి, ఎస్ఐ మహమ్మద్ యాసిన్‌తో కలిసి శివశంకర్ కాలనీ, మెయిన్ రోడ్‌లో కవాతు నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రతిఒక్కరూ ఎటువంటి చట్ట ఉల్లంఘనలు చేయకూడదన్నారు.

విలువలతో కూడిన సమాజం అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విలువలతో కూడిన సమాజం కావాలని జెసిఐ జిల్లా అధ్యక్షులు కూన అనిల్‌కుమార్ అన్నారు. నగరంలోని విద్యాధరి కళాశాలలో మంగళవారం విద్యా వికాసం, వ్యక్తిత్వ వికాస అంశాలపై అవగాహనా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ కీలకమని, ఈ దశలోనే సమయాన్ని, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఉన్నత విలువలు కలిగిన వ్యక్తులుగా తయారు కావాలని కోరారు. స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం, గురజాడ అప్పారావుల వంటి ప్రముఖుల జీవిత విశేషాలను చదవడం వాటిలో కొన్నింటినైనా అన్వయించుకుని ఆచరించాలన్నారు. అప్పుడే ఉత్తమ పౌరులు కాగలరన్నారు. కార్యక్రమంలో జూనియర్ ఛాంబర్ వ్యవస్థాపకులు డాక్టర్ జామి భీమశంకరరావు, సాయిసుధీర్, అంబికా మాధురి, దూసి సంతోష్ మధు, శివతేజ, శ్రీనివాసరావు, పద్మభూషణ్ సాయి, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

'అపోటా' మండల శాఖ ఎన్నిక

కవిటి : ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ నూతన మండల శాఖ ఎన్నిక సహోలాలపుట్టుగ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఆపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దోళాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్నికల ముఖ్య అధికారిగా ప్రమోద్ కుమార్ పాడి, సహాయకులుగా కృష్ణమూర్తి, లావణ్య పాతిక వ్యవహరించారు. ఆపోటా మండల శాఖ నూతన అధ్యక్షుడుగా కేశవ పురియా, ఉపాధ్యక్షుడుగా లింగరాజు పట్నాయక్, కార్యదర్శిగా మనోజ్ కుమార్ మహరణ, సంయుక్త కార్యదర్శిగా ప్రదీప్ కుమార్ గౌడ, కోశాధికారిగా ఉష కిరణ్ గౌడ, కార్యనిర్వాహక సభ్యులుగా వై.బాలరాజు, బి.దేవదాసు, తారిణి ప్రధాన్, తులస ప్రధాన్, రశ్మిత పతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన మండల శాఖ నూతన కమిటీకి ఆపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దోళాయి, ఒడియా ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సూర్యారావు నామినేషన్ దాఖలు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 27న జరగనున్న నేపథ్యంలో భాగంగా అధ్యక్ష స్థానానికి ఎన్ని సూర్యారావు నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కంచరాన నాగభూషణంను బార్ అసోసియేషన్ కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను మంగళవారం అందజేశారు. ఆయన ప్రస్తుతం అసోసియేషన్ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. తిరిగి నాల్గోసారి ఈ పదవికి ఆయన పోటీ చేస్తున్నారు. ఆయనతో పాటు కూన రాజారావు, అల్లు ఈశ్వరరావులు అధ్యక్ష స్థానానికి పోటీ పడుతున్నారు. ఉపాధ్యక్ష, కార్యదర్శి పోస్టులకు ఈసారి గట్టి పోటీ ఉన్నట్టు బార్ సభ్యులు చెపుతున్నారు. సూర్యారావుకు మద్దత్తుగా ఎపి బిసి అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆగూరు ఉమామహేశ్వరరావు, జై భారత్ నేషనల్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ చౌదరి లక్ష్మణరావు, సీనియర్ న్యాయవాదులు తంగి శివప్రసాదరావు, తర్లాడ రాధాకృష్ణ, పాలిశెట్టి మల్లిబాబు, బెజ్జిపురపు ఫాల్గుణరావు, సనపల హరి, బి.వి.రమణదయాల్ మద్దతుగా నిలిచారు.

భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ ప్రధాని మోడీ, జెడ్ కేటగిరి భద్రత కలిగి ఉన్న మాజీ సిఎం చంద్రబాబు, సినీ రంగంలో ప్రజాదరణ ఉన్న నటుడు పవన్ కళ్యాణ్‌లు ఒకే వేదిక పైకి హాజరు అవుతున్నారని తెలిసినా భద్రతా చర్యలను గాలికొదిలేసిన పోలీస్‌శాఖపై చర్య తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. అరసవల్లిలోని ఆమె స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాగళం సభలో భద్రత వైఫల్యంపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. రాష్ట్రంలో సిఎం జగన్మోహనరెడ్డి అడుగులకు మడుగులొత్తుతూ పరదాల చాటున జరిగే పర్యటనలకు ఇస్తున్న కనీస రక్షణ ఈ సభకు ఇవ్వకుండా తొక్కిసలాటకు కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సభలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించకుండా ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు. సమావేశంలో నగర పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, గార మండల ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్, ఉపాధ్యక్షులు వెలమల శ్రీనివాస్, రాష్ట్ర జంగం సంఘం డైరెక్టర్ విభూది సూరిబాబు, జిల్లా రైతు సంఘ కార్యదర్శి సాధు శ్రీను, జిల్లా బిసి సోషల్ మీడియా బుక్క యుగంధర్ పాల్గొన్నారు.

అలాగే నగరంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, ఐటిడిపి అధ్యక్షులు ప్రధాన విజయరాం, రైతు ప్రధాన రాష్ట్ర కార్యదర్శి సింత సుధాకర్, బొణిగి భాస్కరరావు, జోగారావు, రామరాజు కూడా ప్రజాగళం సభలో భద్రతా చర్యల వైఫల్యంపై విచారణ చేపట్టాలని కోరారు.



శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న లక్ష్మీదేవి

కవిటి: ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యంపై తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు.

నరసన్నపేట: చిలకలూరిపేటలో ప్రధాని నరేంద్రమోడీ హాజరైన ప్రజాగళం సభ భద్రతలో నిర్లక్ష్యం వ్యవహరించిన పోలీస్ ఉన్నతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి రమణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, పట్టణ పార్టీ అధ్యక్షులు కింజరాపు రామారావు, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి కృష్ణం నాయుడు, పీసా కృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నరసన్నపేట : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రెండో రోజు సేవా శిబిరం


ఎచ్చెర్ల: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్.కె.వి.జి.డి బాలాజీ సూచనలతో ప్రత్యేక సేవా శిబిరంలో రెండో రోజు ఎస్.ఎం.పురం, ఎచ్చెర్ల గ్రామాల్లో విద్య, నిరుద్యోగం, ఆరోగ్యం తదితర అంశాలపై సర్వే నిర్వహించి ప్రజలకు చైతన్యం కల్పించారు. అనంతరం ఎచ్చెర్ల అంగన్వాడీ కేంద్రం, ఎస్.ఎం.పురం సచివాలయం నుంచి వలంటీర్లు ర్యాలీ నిర్వహించి గ్రామంలో సమస్యలను గుర్తించారు. కార్యక్రమంలో ఒఎస్‌డి ఎల్.డి.సుధాకర్‌బాబు, ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఎఫ్ఒ డా. అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పెద్దింటి ముకుంధరావు, పిఒలు వి.సింహాచలం, జి. ఈశ్వరరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నరసన్నపేట: మండలంలోని సత్యవరంలో ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బి.వి.రత్నమాల, ఎల్.ఎల్లమ్మ, పిఒ పాగోటి మోహనరావు, జి.వి.జగన్నాథం పాల్గొన్నారు.

టెక్కలి : డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ప్రస్తుతం మార్కెట్లో ఉన్న బ్యాంకింగ్ రంగంపై అవగాహన పెంచుకోవాలని ఐసిఐసిఐ బ్రాంచ్ అధికారి శివప్రసాద్ అన్నారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థానిక ధర్మనీలాపురంలో సేవా శిబిరాన్ని సందర్శించారు. జాతీయ సేవా పథకం పిఒ డి.వాసుబాబు పాల్గొన్నారు.

ప్రయాణికురాలికి గాయాలు

ఆమదాలవలస : రైల్వే అధికారుల నిర్లక్ష్యానికి ఓ మహిళా ప్రయాణికురాలు కాలు విరిగి గాయాలపాలయ్యింది. మంగళవారం ఆముదాలవలస రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనుల్లో రైల్వే అధికారుల అలసత్వానికి పొట్నూరు యామిని అనే ప్రయాణికురాలు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చేరింది. సంబంధిత రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, గుత్తేదారు తగు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రయాణికురాలు గాయాలపాలవటం పట్ల రైల్వే అధికారుల నిర్లక్ష్యంపై పలువురు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గార మండలం సతివాడ గ్రామానికి చెందిన పొట్నూరు యామిని తన కుటుంబ సభ్యులతో కలిసి విశాఖపట్నం వెళ్లేందుకు సోమవారం ఉదయం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనుల్లో భాగంగా కార్మికులు కాంక్రీట్ గోడకు డ్రిల్లింగ్ చేస్తుండగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో డ్రిల్లింగ్ మిషన్‌ను పక్కన పెట్టేశారు. కొద్దిసేపటి తర్వాత విద్యుత్ సరఫరా రావడంతో ప్రమాదవశాత్తు డ్రిల్లింగ్ మిషన్ తగిలి యామిని కుడి కాలు విరిగిపోయింది. గాయాల పాలైన ఆమెను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కుటుంబ సభ్యులు రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పలు ఆధునీకరణ పనులలో కాంట్రాక్ట్ చేస్తున్న గుత్తేదారులు రైల్వే సిబ్బంది పూర్తిస్థాయిలో భద్రత తీసుకోకపోవడం వల్లనే ఇటువంటి ప్రమాద సంఘటనలు జరుగుతున్నాయని రైల్వే ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు పరిశీలించి రైల్వే అధికారులు, గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.



గాయాలపాలై విలపిస్తున్న యామిని



పొలాల్లోకి దూసుకుపోయిన మ్యాక్సీ క్యాబ్

మ్యాక్సీ క్యాబ్ బోల్తా

బూర్జ: మండలంలో కొల్లివలస జంక్షన్ మలుపు వద్ద కొల్లివలస నుంచి పాలకొండ వైపు వెళ్తున్న మ్యాక్సీక్యాబ్ ఒక్కసారిగా అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. అయితే ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు.

టైలరింగ్‌పై శిక్షణ

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యాన నగరంలోని డిఎల్‌టిసిలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్ కేంద్రంలో టైలరింగ్ కోర్సులో చేరడానికి మహిళల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎడి రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఐదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23న విద్యార్హతలు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు తీసుకొని బలగ ఆస్పత్రి కూడలిలోని డిఎల్‌టిసి కేంద్రానికి హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ 7095731303 నంబరును సంప్రదించాలన్నారు.

ద్విచక్ర వాహనం వేలం

నౌపడ: నౌపడ పోలీస్ స్టేషన్‌లో గతేడాది ఆగస్టు నెలలో పట్టుబడిన ద్విచక్ర వాహనం హోండా సిబి షైన్‌ను పోలీస్ స్టేషన్ వద్ద వేలం వేయనున్నట్లు ఎస్ఐ కిషోర్ వర్మ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఉదయం వేలం వేస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని ఎస్ఐ కోరారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న రవీందర్

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- బూర్జ

మండలం కె.కె.రాజపురం జంక్షన్‌లో మంగళవారం ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఒరిస్సా నుంచి, శ్రీకాకుళం జిల్లా నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనాలను ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎలక్షన్ కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జి రవీందర్ తెలిపారు. ప్రతిఒక్క వాహనాన్ని తనిఖీలు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అలాగే డిటి సీమల వెంకటరమణ, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది లక్ష్మణరావు, సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, మద్యం, నగదు అక్రమంగా తరలించకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న యువత

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో ఎండ తీవ్రత దృష్ట్యా గత రెండు రోజులుగా బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గ్రామ యువత మజ్జిగ పంపిణీ చేస్తోంది. ఈ సందర్భంగా రెండో రోజు గ్రామానికి చెందిన బి.ప్రసాద్ ఆర్థికసాయంతో 350 మంది విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం గ్రామ యువత మాట్లాడుతూ దాతల సహకారంతో పదో తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు ఈ కార్యక్రమం కొనసాగిస్తామని తెలిపారు.

స్నేహితుని కుటుంబానికి బాసట

వజ్రపుకొత్తూరు: డోకులపాడు పంచాయతీ చినడోకులపాడుకు చెందిన రెయ్యి శాంతారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పల్లిసారథి ఉన్నత పాఠశాలలో శాంతారావుతో కలిసి చదువుకున్న స్నేహితులు ఆ కుటుంబానికి బాసటగా నిలిచారు. మంగళవారం స్నేహితుడు భార్యకు రూ.10 వేలు నగదు అందించారు. కార్యక్రమంలో రాయల భుజింగరావు, కృష్ణవేణి, జానకి, విజయభాను, జానకిరావు, దామోదర్, గోవింద, అప్పారావు, కుమార్ పాల్గొన్నారు.



శాంతారావు భార్యకు నగదును అందిస్తున్న స్నేహితులు